సాక్షి తిరుపతి

శుక్రవారం । 19 । జూలై । 2024



బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించం

బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. - 8లో



500 సెల్ ఫోన్లు రికవరీ

రూ.90లక్షల విలువ చేసే 500 సెల్ ఫోన్లు రికవరీ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడించారు. - 8లో



కలెక్టర్‌కు కోపమొచ్చింది!

జాతీయ రహదారుల ఇరువైపులా చెత్త డంపింగ్‌పై కలెక్టర్ కన్నెర్ర చేశారు. దీంతో అధికారులు చర్యలకు పూనుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఇంజినీరింగ్ అడ్మిషన్లు ప్రారంభం



ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో అడ్మిషన్లు పొందుతున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో గురువారం నుంచి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఏపీ ఈఏపీసెట్-2024 కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 16తో పూర్తికావడంతో ఆన్‌లైన్‌లో బుధవారం మొదటి దశ సీట్లు కేటాయించారు. దీంతో విద్యార్థులు తమకు నిర్దేశించిన కళాశాలలో అడిష్మన్లు పొందుతున్నారు. మొదటి దశ అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 22వరకు కొనసాగనుంది. తిరుపతి ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాలలో అన్ని బ్రాంచ్‌లకు కలిపి తొలి రోజు 150మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. వర్సిటీలోని కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అడ్మిషన్స్ కమిటీ ఫర్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. ప్రొఫెసర్లు దివాకర్, గౌరీమనోహర్, అఖిల స్వతంత్ర పర్యవేక్షణలో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది.

తిరువణ్ణామలైకు 79 ఆర్టీసీ సర్వీసులు

- 20, 21 తేదీల్లో ప్రత్యేక ఏర్పాట్లు

తిరుపతి అర్బన్: పౌర్ణమి పురస్కరించుకుని తిరువణ్ణామలైకు 79 ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి గురువారం మీడియాకు తెలియజేశారు. ఈ నెల 20, 21వ తేదీల్లో తిరుపతి జిల్లాలోని 11 డిపోల నుంచి 79 ప్రత్యేక సర్వీసులతో 190 ట్రిప్పులను తిప్పుతామని వెల్లడించారు. తిరుపతి డిపో నుంచి 15, మంగళం 12, అలిపిరి 6, తిరుమల 15, శ్రీకాళహస్తి 6, పుత్తూరు 5, సత్యవేడు 3, వెంకటగిరి 4, గూడూరు 6, వాకాడు 5, సూళ్లూరుపేట 2 సర్వీసులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. దీనిని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

2022లో ఐదు సర్వీసులతో మొదలై..

2022 జనవరిలో పౌర్ణమి సందర్భంగా తొలిసారిగా 5 సర్వీసులను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. రాబడి పెరగడంతోపాటు భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వీటి సంఖ్యను పెంచుతూ వచ్చారు. 2022 మార్చిలో 12, మేలో 16, జూలైలో 18, సెప్టెంబర్‌లో 22, నవంబర్‌లో 26, 2023 జనవరిలో 42, మార్చిలో 52, మేలో 54,జూలైలో 58, సెప్టెంబర్‌లో 62, నవంబర్‌లో 66, 2024 జనవరిలో 66, మార్చిలో 72, మేలో 76, ప్రస్తుతం 79 సర్వీసులకు పెరిగింది. అంతేకాకుండా పౌర్ణమి సందర్భంగా ఆరు నెలలుగా మూడు ఏసీ సర్వీసులను సైతం నడుపుతున్నారు.

ఇన్‌చార్జి వీసీల నియామకం



అప్పారావు, ఇన్‌చార్జి వీసీ, ఎస్వీయూ



ప్రొఫెసర్ ఉమ, ఇన్‌చార్జి వీసీ, మహిళా వర్సిటీ


తిరుపతి సిటీ: విశ్వ విద్యాలయాలలో నెలరోజులుగా నెలకొన్న ఉత్కంఠ ఎట్టకేలకు తెరపడింది. జిల్లాలోని రెండు వర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుతం ఎస్వీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్‌గాను, వర్సిటీ అకడమిక్ డీన్‌గా పనిచేస్తున్న సీనియర్ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావును ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీగా నియమించింది. ఆయన వర్సిటీలో 35 ఏళ్ల పాటు అధ్యాపకులుగా పనిచేసి అనుభవం ఉంది. అలాగే, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో గతంలో ఇన్‌చార్జి వీసీగా, రెక్టార్‌గా సుదీర్ఘ కాలం పనిచేసిన సీనియర్ ప్రొఫెసర్ వి.ఉమను ఇన్‌చార్జి వీసీగా నియమించింది.

గత వీసీల రాజీనామాకు గవర్నర్ ఆమోదముద్ర

నూతన ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల నుంచి టీడీపీ నాయకుల దాడులు, బెదిరింపులతో ఎస్వీయూ, మహిళా వర్సిటీ వీసీలు రాజీనామాలు సమర్పించారు. నెలరోజులుగా రాజీనామాలను ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచింది. మంగళవారం రాత్రి వీటికి గవర్నర్ ఆమోదముద్ర పడింది.

భక్తుల రద్దీ అధికం

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 69,029 మంది దర్శించుకున్నారు. వీరిలో 28,547 మంది తలనీలాలు ఇవ్వగా, కానుకల రూపంలో హుండీలో రూ. 2.90 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో,దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.





తండ్రి.. తనయుడే టార్గెట్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలుకుని రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని సరికొత్త రాజకీయ విష సంస్కృతికి ఆజ్యం పోసింది. ప్రజాసేవకు బదులు ప్రతిపక్షాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా అరాచకాలు, దౌర్జన్యాలు, ఆస్తుల విధ్వంసం, హింసాత్మక దాడులతో పేట్రేగిపోతోంది. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులపై దాడులకు తెగబడటమే లక్ష్యంగా 'రెడ్‌బుక్ రాజ్యాంగం' నడుస్తోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పుంగనూరులో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్పపై టీడీపీ మూకలు చేసిన దాడుల్ని చూసి ప్రజానీకం నివ్వెరపోతోంది.

అంతటా రెడ్‌బుక్ రాజ్యాంగమే..

- పెద్దిరెడ్డి కుటుంబ సభ్యుల విజయాన్ని జీర్ణించుకోలేని కూటమి
- ఎంపీ, ఎమ్మెల్యే రాకపోకలు, నివాసానికి వచ్చి వెళ్తున్న వారిపై నిఘా
- వారిద్దరూ పుంగనూరులో పర్యటిస్తే టీడీపీకి మనుగడ ఉండదని కుట్రలు
- 40 రోజులుగా ఎంపీ, ఎమ్మెల్యేలను హౌస్ అరెస్ట్ చేసి నిర్బంధించిన ప్రభుత్వం
- పుంగనూరు, కుప్పంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా తెగబడుతున్న వైనం
- భయపెట్టి, దాడులు చేసి వైఎస్సార్‌సీపీ శ్రేణులను లొంగదీసుకుంటున్న టీడీపీ
- కూటమి నేతల అరాచకాలతో భయం గుప్పెట్లో పచ్చని పల్లెలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తండ్రీ కొడుకులే లక్ష్యంగా కూటమి పెద్దలు అడుగులు వేస్తున్నారు. నివాసం నుంచి తమ సొంత నియోజకవర్గంలోకి అడుగుపెట్టనివ్వకుండా పోలీసులతో అడ్డుకుంటున్నారు. నియోజకవర్గంలోకి అడుగుపెడితే టీడీపీ మూకల చేత దాడులకు ఉసిగొల్పుతున్నారు. ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం చోటు చేసుకుంటున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ముఖ్యులు. ఎన్నికల సమయంలో వీరిద్దరికీ రాయలసీమతో పాటు, ఏలూరు, కాకినాడ జిల్లాల బాధ్యతలు కూడా అప్పగించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా చంద్రబాబు ప్రాతినిధ్యం వహించిన కుప్పం నియోజకవర్గంపై పెద్దిరెడ్డి కుటుంబం ప్రత్యేక దృష్టి సారించింది. నియోజక వర్గాన్ని అభివృద్ధి చేయడంలో కానీ, కుప్పం బ్రాంచ్ కెనాల్‌కి కృష్ణానది నీటిని తీసుకొచ్చే విషయంలో తండ్రీ కొడుకులిద్దరూ ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి గెలుపొందారు. పెద్దిరెడ్డి కుటుంబంలో పోటీచేసిన ముగ్గురూ విజయం సాధించటంతో కూటమి పెద్దలు జీర్ణించుకోలేకపోతున్నారు. వచ్చే ఎన్నికల సమయం వరకు తండ్రీ కొడుకులు ఇలాగే కొనసాగితే మళ్లీ ఓటమి తప్పదని భావించిన కూటమి పెద్దలు సొంత నియోజకవర్గంలో కూడా తిరగనివ్వకుండా అడ్డుకుంటున్నారు. అలాగే తండ్రీ కొడుకులకు మద్దతుగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను పూర్తిగా అణగదొక్కేందుకు నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారు.



పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటి వెలుపల దాడులు చేస్తున్న తెలుగుదేశం కార్యకర్తలు



పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిలోకి ప్రవేశించి దాడులు చేస్తున్న టీడీపీ కార్యకర్తలు



పోలీసులు అడ్డుకుంటున్నా రెడ్డెప్ప ఇంటివద్ద తోసుకువస్తున్న టీడీపీ కార్యకర్తలు





పుంగనూరులో తెలుగుదేశం గూండాలు ధ్వంసం చేసిన ఎంపీ మిథున్‌రెడ్డి వాహనాలు



మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటి వెలుపల దాడులు చేస్తున్న తెలుగుదేశం కార్యకర్తలు

సొంత నియోజకవర్గంలో పర్యటించకుండా..

ఎక్కడో పాకిస్తాన్, బిహార్‌లో ఇలాంటి సంఘటనలు చూస్తుంటాం, వింటుంటాం. ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం, ప్రశాంతతకు, పవిత్రతకు, ఆధ్యాత్మికతకు నిలయమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి ఘటనలు చూస్తామని, వింటామని కలలో కూడా అనుకుని ఉండరేమో! కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రశాంతమైన ఏపీలో, ముఖ్యంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో హింసాత్మక దాడులు, దౌర్జన్యాల సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. రాజంపేట పార్లమెంట్, పుంగనూరు నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కావాలని ఓట్లేసి గెలిపించుకున్నారు. స్థానికుల ఓట్లతో విజయం సాధించిన ఈ ఇద్దరూ ప్రజలకు అందుబాటులో ఉండడం, వారికి సేవచేయటం వారి బాధ్యత. ఆ బాధ్యతల నుంచి తండ్రీ కొడుకులను దూరం చేయాలని కూటమి పెద్దలు కుట్రలు పన్నుతున్నారు. అందులో భాగంగా గత నెల 15న పుంగనూరు పర్యటనకు సిద్ధమైన తండ్రీ కొడుకులను నివాసం నుంచి కదలకుండా హౌస్ అరెస్ట్ చేశారు. అదేమంటే శాంతి భద్రతల కోసం అని పోలీసులు చెప్పడం మరో విడ్డూరం. ఎంపీ, ఎమ్మెల్యే పర్యటనలకు ఎలాంటి ఆటంకం కలగకుండా.. ప్రజలకు సేవ చేయాల్సిన పోలీసులను ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై పగ సాధించడానికి వినియోగించుకుంటోంది. తాజాగా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నియోజకవర్గ పర్యటన నిమిత్తం గురువారం పుంగనూరుకు చేరుకున్నారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప నివాసంలో ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డిని హత్య చేసేందుకు టీడీపీ మూకలు రాళ్లు, కర్రలు, కోడి గుడ్లతో దాడులకు తెగబడ్డాయి. ప్రశాంతమైన పుంగనూరులో బీభత్సం సృష్టించాయి. 40 రోజులకు పైగా తండ్రీ కొడుకులను నియోజక వర్గ ప్రజలకు దూరంగా స్వగృహంలో నిర్బంధించి, వారి నివాసానికి వచ్చి వెళ్లేవారి వివరాలను పోలీసులు ఎప్పటికప్పుడు కూటమి పెద్దలకు సమాచారం చేరవేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.



జూన్ 30న పుంగనూరు పర్యటనకు వెళుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి హౌస్ అరెస్టు నోటీసు ఇస్తున్న పోలీసులు (ఫైల్)

నిత్యం దాడులు..దౌర్జన్యాలు

పుంగనూరు, కుప్పం, తంబళ్లపల్లె నియోజకవర్గ పరిధిలో బరితెగించిన టీడీపీ మూకలు వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నాయి. ప్రతి రోజూ ఏదో ఒక గ్రామంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కూటమి నేతలు దాడులు చేసి తీవ్రంగా గాయపరచారని, వారి ఆస్తులు ధ్వంసం చేశారని, పంట ఉత్పత్తులు నాశనం చేశారనే వార్తలు నిత్యకృత్యమయ్యాయి. అలాగే వైఎస్సార్‌సీపీ శ్రేణులపై తప్పుడు కేసులు బనాయించి అరెస్టులు చేయించటం షరా మామూలైంది. టీడీపీ మూకలే వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేసినా, పోలీసులు మాత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలదే తప్పని ఎదురు కేసులు పెడుతుండడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది పోలీసుల కారణంగా మొత్తం వ్యవస్థకే మకిలి అంటుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, కార్పొరేషన్, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, జిల్లా, నియోజకవర్గం, మండల, గ్రామ స్థాయి నాయకులను బెదిరించి, భయపెట్టి, ఆస్తులు ధ్వంసం చేసి, వారిని లొంగదీసుకుంటున్నారు. కూటమి శ్రేణుల అరాచకాలతో పలువురు ఊరొదిలి వెళ్లిపోయారు. మరి కొందరిని ఇప్పటికీ గ్రామాల్లో నిర్బంధించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇంత జరుగుతున్నా, బాధితులు పోలీసులకు ఫోన్ చేసినా స్పందించకపోవడం విస్మయం కలిగిస్తోంది. నేరుగా పోలీస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయటం లేదనే ఆరోపణలు వస్తుండం చూస్తుంటే పోలీస్ వ్యవస్థ ఏ పక్షాన కొమ్ము కాస్తోందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లా చరిత్రలో ఎన్నడూ జరగని ఈ 40 రోజుల కాలంలో చోటుచేసుకున్న అరాచకాలు, వీటిని నిత్యకృత్యం చేస్తున్న వైనం చూసి స్థానికులు భయకంపితులవుతున్నారు. గడపదాటితే ఎప్పుడు ఏం జరుగుతుందో, ఎవరిపై ఎటువంటి కేసులు పెడతారోనని భయంతో వణికిపోతుండటం కూటమి ప్రభుత్వ తీరుకు నిదర్శనం.

చంద్రబాబు అరాచకానికి నిదర్శనం



శ్రీరంగరాజపురం : రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిపై హత్యాయత్నం, మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిపై టీడీపీ నేతలు దాడి చేయడం చంద్రబాబు అరాచకానికి నిదర్శనం. తన సొంత నియోజకవర్గంలోని పుంగనూరుకు వెళ్లిన ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడి చేయడం, మాజీ ఎంపీ ఇంటిని ధ్వంసం చేయడం, ఆవరణలో ఉన్న కార్లను తగుల పెట్టడం చూస్తుంటే టీడీపీ రాక్షస రాజకీయం చేస్తోందన్న విషయం అర్థమవుతుంది. ఇంత జరుగుతున్నా అక్కడే ఉన్న పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం దుర్మార్గం. ఎంపీగా గెలిచిన ప్రజాప్రతినిధులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కనుమరుగవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విష సంస్కృతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాంది పలికారు. రాష్ట్రంలో ఇంత ఘోరంగా దాడులు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం మరియు న్యాయ వ్యవస్థ స్పందించకపోవడం శోచనీయం. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో ముమ్ముందు శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతింటాయి. ఇకనైనా టీడీపీ ఇలాంటి చర్యలు మానుకోవాలి.

– నారాయణస్వామి, మాజీ డిప్యూటీ సీఎం

ఎంపీపై హత్యాయత్నం హేయం



వి.కోట: పుంగనూరులో ఎంపీ మిథున్ రెడ్డిపై టీడీపీ నాయకులు హత్యాయత్నం చేయడం హేయమైన చర్య. పుంగనూరులో ఇటీవల టీడీపీ నాయకుల చేతుల్లో దెబ్బలు తిన్న వైఎస్సార్‌సీపీ నాయకులను కలవడానికి, మాజీ ఎంపీ రెడ్డెప్ప నివాసానికి విచ్చేసిన ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడులు చేయడం దుర్మారం. పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి కుటుంబంపై దాడులు ఆపాలి. ఆ కుటుంబాన్ని అంతం చేయాలని చూస్తున్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.3,000 కోట్లతో ఎన్నో అభివృద్ధి పనులు చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి అనంతపురం – మదనపల్లె, మదనపల్లె– పలమనేరు, మదనపల్లె–తిరుపతి రోడ్లతో పాటూ ఎన్నో బ్రిడ్జిలు నిర్మించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతి పరులపై కూటమి నాయకులు గతంలో ఏ ప్రభుత్వంలోనూ లేని విధంగా దాడులకు పాల్పడుతూ ప్రాణాలను సైతం హతమారుస్తున్న పరిస్థితులను ప్రజలంతా చూస్తున్నారు. దీనికంతా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తగిన మూల్యం చెల్లించాలి. ఇకనైనా దాడులను ఆపి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలి.

– శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

తగిన మూల్యం చెల్లించకతప్పదు



వరదయ్యపాళెం: ప్రశాంత వాతావరణంలో ఉన్న పుంగనూరులో టీడీపీ నేతలు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. దళిత మాజీ ఎంపీ రెడ్డెప్పను కలిసేందుకు పుంగనూరుకు వెళ్లిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై హత్యాయత్నం చేయడం, అలాగే రెడ్డెప్పపై, ఆయన ఇంటి పైన రాళ్ల వర్షం కురిపించడం హేయమైన చర్య. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు శాంతిభద్రతలు కరువయ్యాయి. మహిళలు, బాలికలకు రక్షణ కరువైంది. అధికార దర్పంతో ఎలా విర్రవీగుతున్నారో ప్రజలే చూస్తున్నారు. ప్రజాప్రతినిధి మిథున్ రెడ్డి, ఆయన సొంత నియోజకవర్గంలో పర్యటించేందుకు స్వేచ్ఛ లేకుండా టీడీపీ నేతలు అలజడులు సృష్టించడం ఎంతమాత్రమూ సరికాదు. ఇలాంటి సంస్కృతిని గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనుసరించి ఉంటే అప్పట్లో టీడీపీ నేతల పరిస్థితి ఏమై ఉంటుందో ఆలోచించుకోవాలి.

–నూకతోటి రాజేష్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, సత్యవేడు

మిథున్‌రెడ్డిపై హత్యాయత్నం దుర్మార్గం



వి.కోట: ప్రజాప్రతినిధిగా గెలిచిన ఎంపీ మిథున్‌రెడ్డిపై పుంగనూరులో టీడీపీ నేతలు హత్యాయత్నం చేయడం దుర్మార్గం. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి అధికారం చేపట్టి 40 రోజులు కావస్తున్నా రాష్ట్రంలో ఎక్కడ చూసినా హత్యలు, దాడులు, దౌర్జన్యాలు మానభంగాలు పెరిగిపోతున్నాయి. ప్రధానంగా టీడీపీ మూకలు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలపై నిష్కారణంగా దాడులకు తెగబడుతున్నారు. మిథున్‌రెడ్డికి ప్రాణహాని ఉంది. వెంటనే కేంద్ర ప్రభుత్వం సెక్యూరిటీ కల్పించాలి. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను వెంటాడి, వేటాడుతున్నారు. అయినా పోలీసులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పుంగనూరులో అయితే మరీ విడ్డూరంగా దగ్గరే ఉండి టీడీపీ గూండాల దాడులను చూస్తూ ఉండడమేంటి? అసలు రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఉందా? కూటమి ప్రభుత్వం అరాచకాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇప్పటికైనా ఇలాంటి దాడులకు మానుకుని పరిపాలన మీద దృష్టి పెట్టాలి.

–పీఎస్. నాగరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

దారుణ కృత్యాలపై భగ్గుమన్న విద్యార్థి లోకం

- కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలు, చిన్నారులకు కరువైన రక్షణ
- ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి విమర్శ



బాలాజి కాలనీ సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: రాష్ట్రంలో చిన్నారులు, ఆడపిల్లలపై లైంగికదాడులు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సి ప్రవీణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చిన్నారులపై చోటుచేసుకుంటున్న దారుణ అకృత్యాలకు నిరసిస్తూ గురువారం స్థానిక బాలాజీ కాలనీ సర్కిల్ వద్ద ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు, చిన్నారులకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. కామాంధులకు బలవుతున్న పసిప్రాణాలను కాపాడలేని ప్రభుత్వం ప్రజలకు ఏం మేలు చేస్తుందని మండిపడ్డారు. నంద్యాలలో జరిగిన దారుణం మరువకముందే జిల్లాలోని దొరవారిసత్రం, నెలబల్లిలో 8ఏళ్ల బాలికపై కామాంధుడు అత్యాచారం చేసి హతమార్చిన ఘటన ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. నిందితులకు అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, మహిళలకు పూర్తి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. జిల్లాలో గంజాయి ఏరులై పారుతోందని, మహిళలకు జరుగుతున్న దారుణాలకు ఇది కూడా కారణమని, తిరుపతిని గంజాయి రహిత జిల్లాగా చేసేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ ఉపాధ్యక్షులు ఓం రాజ్, వినయ్, శివనాయక్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.76,900
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.6,859
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.94,300
రిటైల్ వెండి గ్రాము రూ.96.30

క్లుప్తంగా

విద్యుత్ ప్రమాద రహిత సర్కిల్‌గా తిరుపతి

- ప్రమాదాలపై వినియోగదారులకు మరింత అవగాహన
- సిబ్బందికి ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ సురేంద్రనాయుడు ఆదేశం

తిరుపతి రూరల్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యుత్ ప్రమాద రహిత సర్కిల్‌గా తిరుపతిని తీర్చిదిద్దాలని ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ సురేంద్రనాయుడు ఆదేశించారు. గురువారం తిరుపతిలోని సర్కిల్ ప్రధాన కార్యాలయం విద్యుత్ భవన్ నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని షిఫ్ట్ ఆపరేటర్ల నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వరకు ఉన్న 3,500 మంది సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాకాలంలో చోటు చేసుకునే విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే పట్టణాల్లో 12 గంటలలోపు, గ్రామాల్లో 24 గంటల లోపు, వ్యవసాయ కనెక్షన్‌కు అయితే వీలైనంత త్వరగా మార్చాలన్నారు. ఎల్‌సీలు ఇచ్చేటప్పుడు సిబ్బంది పూర్తిస్థాయి రక్షణ తీసుకోవాలన్నారు. అవసరానికి మించిన ఫ్యూజ్‌లు వేయడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, వాటిని మరమ్మతులు చేయాలంటే సమయం వృథా కావడంతో పాటు ఒక్కోదానికి దాదాపు రూ.20 వేల వరకు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మోటర్ వద్ద నాణ్యమైన విద్యుత్ పరికరాలు వాడటం, సేఫ్టీ ట్రిప్పింగ్, నాణ్యమైన ఎర్త్ వాడటం ..ఇత్యాది వాటిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడా విద్యుత్ సమస్యలు ఉన్నా 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కోపమొచ్చింది!

- జాతీయ రహదారి బాగుపడింది
- చెత్త డంపింగ్‌లపై కదిలిన యంత్రాంగం
- ట్రెంచ్‌లు కొట్టి..హెచ్చరిక బోర్డులు ఏర్పాటు
- చెత్త వేస్తే రూ.10వేలు జరిమానా తప్పదని వార్నింగ్



జాతీయ రహదారి పక్కన చెత్త వాహనాలను అడ్డుకునేందుకు ట్రెంచ్ కొడుతున్న దృశ్యం

తిరుపతి రూరల్: జాతీయ రహదారుల సుందరీకరణకు బదులు చెత్త డంపింగ్‌తో కంపరం పుట్టేలా చేస్తున్నారు. ఆధ్యాత్మిక నగరి తిరుపతికి ముఖద్వారంగా ఉన్న తిరుపతి రూరల్ మండలంలోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ప్రాంతాలు డంపింగ్ యార్డుగా మారిన వైనం చూస్తే అధికారులు ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారో కళ్లకు కట్టినట్లు చూపుతున్నాయి. జాతీయ రహదారికి ఇరు వైపులా తిరుపతితో పాటు సమీప గ్రామాల్లో సేకరించిన చెత్తను తీసుకు వచ్చి రోడ్డు పక్కనే పోస్తున్నారు! నెలల కాలంగా చేస్తున్న ఈ చెత్త డంపింగ్ వల్ల జాతీయ రహదారి ఇరువైపులా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. శ్రీవారి దర్శనార్థం వాహనాల్లో వచ్చే భక్తులు, ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులకు, మోటార్ సైక్లిస్టులకు ఈ చెత్తకుప్పలు కంపరం కలిగిస్తున్నాయి. ఈనేపథ్యంలో జిల్లాకు కలెక్టర్‌గా వచ్చిన వెంకటేశ్వర్ దృష్టి దీనిపై పడింది. ఎంఆర్‌పల్లెలోని కలెక్టర్ బంగ్లా నుంచి జిల్లా కలెక్టరేట్‌కు ఈ మార్గంలోనే రోజూ రాకపోకలు సాగిస్తున్న తరుణంలో పారిశుధ్యం సమస్యలకు తావిస్తోన్న ఈ చెత్త డంపింగ్‌లను ఆయన చూశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారంటూ డీపీఓ, తిరుపతి డివిజన్ పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు పక్కన చెత్త డంపింగ్‌ను అరికట్టాలని ఆదేశించారు. దీంతో జాతీయ రహదారికి అనుకుని ఉన్న గాంధీపురం, మల్లంగుంట, అవిలాల, వేదాంతపురం, ఓటేరు, శ్రీనివాసపురం, తిరుచానూరు పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు తిరుపతి రూరల్ ఈఓపీఆర్డీ గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. చెత్తను వేయకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

చెత్తను డంపింగ్ చేస్తున్న ఏరియాలను గుర్తించారు. వాహనాల రాకపోకలు జరగకుండా అక్కడ ట్రెంచ్‌లను కొట్టారు. చెత్త వేస్తే రూ.10 వేల జరిమానా అంటూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఎవరైనా రోడ్డు పక్కన చెత్తను డంప్ చేస్తే చట్ట ప్రకారం శిక్ష తప్పదని ఈఓపీఆర్డీ గిరిధర్‌రెడ్డి హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్లు, ఆటోల ద్వారా పారిశుధ్య కార్మికులు, సిబ్బంది హైవే పక్కన గ్రామ పంచాయతీల చెత్తలు డంప్ చేస్తే సిబ్బంది జీతం నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తామన్నారు.

రేపటి నుంచి మహతిలో జాతీయ స్థాయి నాటక పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్ రెడ్డి

తిరుపతి కల్చరల్: టీటీడీ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో అభినయ ఆర్ట్స్ హనుమ అవార్డ్ జాతీయ స్థాయి నాటక, నృత్య పోటీలు మహతి కళాక్షేత్రంలో ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నామని అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్. రెడ్డి తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అభినయ ఆర్ట్స్ 24వ వార్షికోత్సవంలో భాగంగా తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలలో 9 పౌరాణిక పద్యనాటకాలు, 12 సాంఘిక నాటికల ప్రదర్శనలు ఉంటాయన్నారు. అలాగే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది శాస్త్రీయ, జానపద బృందం, సోలో నృత్య పోటీలకు సుమారు 300 కళాకారుల బృందాలు హాజవుతున్నట్టు చెప్పారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నృత్య పోటీలు, మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు పౌరాణిక, సాంఘిక నాటక పోటీలు నిర్వహిస్తామని, పోటీలలో విజేతలకు 28న అభినయ హనుమ అవార్డ్స్‌తో పాటు నగదు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కళాకారులు, కళాభిమానులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. అభినయ ఆర్ట్స్ గౌరవాధ్యక్షుడు ఎస్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ, ఒక పండుగ వాతావరణంలో ఈ పోటీలను నిర్వహిస్తామని, ఆధునిక పోకడలతో కనుమరుగవుతున్న మన సంస్కృతీ సాంప్రదాయ కళలను ఇప్పటి తరానికి అందించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. పాఠశాలల విద్యార్థులు ఈ వారసత్వ సంపదను అందుకోవాలని ఆకాంక్షించారు. సమావేశంలో అభినయ ఆర్ట్స్ ముఖ్య సలహాదారుడు విజయకుమార్, అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, సభ్యుడు ఇరముని శేఖర్ పాల్గొన్నారు.

21న ఐఐటీలో స్నాతకోత్సవం

ఏర్పేడు: మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో ఈ నెల 21న 6వ స్నాతకోత్సవం నిర్వహించనున్నట్టు డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు క్రిస్ గోపాలకృష్ణన్, గవర్నర్స్, జేఎస్‌డబ్ల్యూ గ్రూపు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ జిందాల్ హాజరు కానున్నట్లు తెలియజేశారు.

కుళ్లిన కూరగాయలతోనే భక్తులకు భోజనాలు!



హోటల్‌ను తనిఖీ చేస్తున్న ఈవో, ఎఫ్ఎస్‌డీ అధికారులు

తిరుమల: తిరుమలలోని కౌస్తుభం విశ్రాంతి భవనం సమీపంలో ఉన్న బాలాజీ భవన్ హోటల్ భక్తుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించడాన్ని టీటీడీ గుర్తించింది. ఇటీవల కొందరు శ్రీవారి భక్తులు ఈ హోటల్‌లో భోజనం చేసి అస్వస్థతకు గురయ్యారని, యాత్రికుల నుంచి ఈమెయిల్ ఫిర్యాదులు అందడంతో ఫుడ్ సేఫ్టీ విభాగం (ఎఫ్ఎస్‌డీ) అధికారులతో కలిసి టీటీడీ ఈవో శ్యామలరావు గురువారం ఈ హోటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్‌లోని ఆహార పదార్థాలు, ముడి సరుకుల నిల్వ, శుభ్రపరిచే విధానం తదితర పద్ధతులను పరిశీలించారు. చాలా కూరగాయలు కుళ్లిపోయినట్లు గుర్తించారు. పారిశుద్ధ్య చర్యలు కూడా నాసిరకంగా ఉండటాన్ని గమనించారు. ఈవో మీడియాతో మాట్లాడుతూ..హోటల్ నిర్వాహకులు ఆహార భద్రతా నిబంధనలను పాటించడం లేదని, అపరిశుభ్రత మధ్యే హోటల్‌లో ఆహారాన్ని తయారు చేస్తున్నట్లు తెలిపారు. తిరుమలలోని హోటళ్లు పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో, భవిష్యత్తులో ఇలాంటి తనిఖీలు మరిన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఎఫ్ఎస్‌డీ డైరెక్టర్ మాట్లాడుతూ..తనిఖీల్లో ఈ హోటల్‌లో పూర్తిగా ఆహార భద్రతా నిబంధనలను పాటించలేదని తేలిందన్నారు. ఇక్కడి వంటగదిని వెంటనే మూసివేస్తామని, విచారణ జరిపిన హోటల్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

మొబైల్ ల్యాబ్ ప్రారంభం

ఎఫ్ఎస్‌డీ డైరెక్టర్‌తో కలిసి ఈవో మొబైల్ ల్యాబ్, 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్'ను ప్రారంభించారు. ప్రత్యేకమైన ఈ వాహనం ఆహారం, నీటి నాణ్యతను తనిఖీ చేయడానికి అవసరమైన పరికరాలతో కూడిన ల్యాబ్‌ను కలిగి ఉంది. ఈ మొబైల్ ల్యాబ్‌లో 80 రకాల పదార్థాల నాణ్యతలను తనిఖీ చేస్తారు. దీనిని ప్రత్యేకంగా తిరుమలలో ఆహారం, నీరు నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు వినియోగిస్తారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి



దాడికి పాల్పడిన బెంగాల్‌వాసి



హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేస్తున్న బెంగాల్‌వాసి

గూడూరు రూరల్ : విధి నిర్వహణ నిమిత్తం వెళ్తున్న ఓ హెడ్ కానిస్టేబుల్‌పై ఓ వ్యక్తి కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన గురువారం గూడూరులో చోటు చేసుకుంది. పట్టణ సీఐ పాపారావు కథనం...గూడూరుకు చెందిన స్వామిదాసు రూరల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. సాయంత్రం బీట్‌కు మరో కానిస్టేబుల్‌తో కలసి వెళ్లేందుకు బైక్‌పై సాధుపేట ప్రాంతంలోని ఓ టీ దుకాణానికి వచ్చారు. టీ తాగేందుకు దుకాణంలోకి వెళ్తుండగా వెనుకనే వచ్చిన ఓ ఆగంతకుడు కర్రతో హెడ్ కానిస్టేబుల్ తలపై మోదాడు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ పడిపోయాడు. దాడి చేసిన వ్యక్తిని కానిస్టేబుల్, చుట్టుపక్కల వారు పట్టుకున్నారు. అతడిని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తీవ్రంగా గాయపడిన హెడ్‌కానిస్టేబుల్‌కు గూడూరు ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. దాడి చేసిన వ్యక్తి బెంగాల్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించామని, అయితే అతని మానసిక పరిస్థితి సరిగా లేదని, అతని పేరు లల్తూకలిండిగా చెబుతున్నాడని, విచారణ అనంతరం అతడిని కోర్టులో హాజరు పరుస్తామని సీఐ తెలిపారు.

తాగునీటికి కటకట!

-విద్యుత్ భవన్‌లో పనిచేయని ఆర్వో ప్లాంట్
-ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు



తిరుపతిలోని విద్యుత్ భవన్‌లో పనిచేయని ఆర్వో వాటర్ ప్లాంట్

తిరుపతి రూరల్: తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ప్రధాన కార్యాలయం విద్యుత్ భవన్‌లో తాగునీటి సమస్యతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఎస్ఈ కార్యాలయంలో మొత్తం 286 మంది రోజు పనిచేస్తుంటారు. కార్యాలయం రెండో అంతస్తులో ఉన్న ఆర్వో ప్లాంట్‌తో కూడిన ఫ్రిజ్ రెండు నెలల క్రితం చెడిపోయింది. దీనికి మరమ్మతులు చేయించండి మహాప్రభో అని సర్కిల్ ఎస్ఈ, టెక్నికల్ ఈఈకి ఎన్నోసార్లు కోరినా పట్టించుకోవడం లేదని సిబ్బంది వాపోతున్నారు. దీంతో బయట నుంచి తాగునీటిని తెప్పించుకోవాల్సి వస్తోందని, ఇకనైనా ఎస్ఈ స్పందించి ఆర్వో ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



టిటిడి ఈఓ శ్యామలరావుకు విరాళం అందజేస్తున్న బ్యాటేగౌడ

తిరుమల: బెంగుళూరుకు చెందిన ఏబీయం ఇన్‌ఫ్రాటెక్ అధినేత ఎస్ఎన్ బ్యాటేగౌడ టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు గురువారం రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో టీటీడీ ఈఓ జె.శ్యామలరావుకు చెక్కు రూపేణా విరాళం అందజేశారు. కార్యక్రమంలో చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తి నాని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కామాంధుడు అరెస్టు

దొరవారిసత్రం: చిన్నారిపై లైంగిక దాడి, హత్య చేసిన కేసులో నిందితుడు దిలీప్‌కుమార్‌ను గురువారం దొరవారిసత్రం పోలీసులు అరెస్ట్ చేశారు. నెలబల్లి గ్రామ శివారుల్లోని అటవీ ప్రాంతంలో ఎనిమిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన రైస్ మిల్లు కార్మికుడు దిలీప్‌కుమార్ లైంగిక దాడి చేయడమే కాక హత్య చేసిన విషయం తెలిసిందే. దీంతో పోలీసులు, నాయుడుపేట డీఎస్పీ, ఐడీ పార్టీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించే క్రమంలో రైస్ మిల్లులోని సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించి అసలు విషయం తెలుసుకున్నారు. ఇంతటి దారుణానికి పాల్పడిన దిలీప్‌కుమార్‌ను ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి శుక్రవారం సూళ్లూరుపేట కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఎస్సై తిరుమలరావు తెలిపారు.

అదనపు వరకట్నం కోసం వేధింపులు : నలుగురిపై కేసు

ఏర్పేడు: అదనపు వరకట్నం వేధింపులపై మండలంలోని ఆమందూరు పంచాయతీ వ్యాస్‌నగర్‌లో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు గురువారం రాత్రి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. మండలంలోని పల్లం ఎస్సీ కాలనీకి చెందిన పల్లం కవితకు వ్యాస్‌నగర్‌కు చెందిన పవన్ మణికుమార్‌కు మూడేళ్ల క్రితం వివాహమైంది. అప్పట్లో కొంత నగదు, బంగారు ఆభరణాలను వరకట్నం కింద కవిత తల్లిదండ్రులు అందజేశారు. కొంతకాలంగా వారి కాపురం సజావుగా సాగింది. ప్రస్తుతం ఆమె గర్భవతిగా ఉంది. కొన్ని రోజులుగా అదనపు వరకట్నం కోసం పవన్ మణికుమార్, కుటుంబ సభ్యులు లక్ష్మి, వెంకటరమణయ్య, రజని వేధిస్తుండడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశారు.

కక్ష సాధింపు చర్యలు సరికాదు



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- న్యాయం కోసం కోర్టులను ఆశ్రయిస్తాం
- రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై టీడీపీ మూకల దాడి శోచనీయం
- వినుకొండలో హత్య ఘటన దారుణం
- వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఉద్దేశపూర్వకంగా కక్షసాధింపు చర్యలకు టీడీపీ కూటమని ప్రభుత్వం పాల్పడడం ఎంతమాత్రమూ సరికాదని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఖండించారు. వెంకటగిరిలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ కంటే మిన్నగా పరిపాలన చేస్తామని సూపర్‌సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం గంటల వ్యవధిలోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం, భవనాలను కూల్చివేయడం, దాడులకు పాల్పడటం..లాంటి చర్యలను నిత్యకృత్యంగా మార్చుకుందని విమర్శించారు. ఇదే తరహాలో వెంకటగిరి వైఎస్సార్‌సీపీ నేత పేచీరాజ్‌పై టీడీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా హత్యాయత్నం చేశారని అయితే పోలీసు కేసు నమోదులో వ్యవహరించిన తీరు ఎంతమాత్రమూ సరిగా లేదన్నారు.. ఈ విషయమై తిరుపతి ఎస్పీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలియజేశారు. ఇక వైఎస్సార్‌సీపీ కార్యకర్త నిర్మించుకున్న ఫంక్షన్ హాలు కూల్చివేతకు టీడీపీ నేతలు యత్నించి, నోటీసులు సైతం అధికారులతో జారీ చేయించారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉండేందుకు కోర్టులను సైతం ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప నివాసానికి వెళ్లిన సందర్భంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నేతలు రాళ్లదాడికి పాల్పడడం శోచనీయమన్నారు. అలాగే వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను టీడీపీ నేత జిలాని ప్రజలందరూ చూస్తుండగా కత్తితో విచక్షణారహితంగా దాడిచేసి హత్య చేయడం అమానుషమని, మరోవైపు అక్రమ కేసులు బనాయించడం ఏ సంస్కృతి అని ప్రశ్నించారు. ఇకనైనా టీడీపీ కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు స్వస్తి పలికాలని హితవు పలికారు. వెంకటగిరి నియోజకవర్గంతో పాటు తిరుపతి పార్లమెంట్ పరిధిలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెందోటి మధురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పేచీరాజ్, తోట గణేష్‌రెడ్డి, కునా మల్లికార్జున్, రంగనాథం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మిథున్‌పై దాడి అరాచకానికి నిదర్శనం

– వైఎస్సార్‌సీపీ నాయకుడు హరికృష్ణ



హరికృష్ణ

గంగాధరనెల్లూరు: రాజంపేట ఎంపీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై దాడి చేయడం టీడీపీ అరాచకానికి నిదర్శమని వైఎస్సార్ సీపీ నాయకుడు ఆనగంటి హరికృష్ణ దుయ్యబట్టారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరికృష్ణ మాట్లాడుతూ, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంట్లో ఉన్న మిథున్‌రెడ్డిపై టీడీపీ మూకలు పథకం ప్రకారం రాళ్లదాడి చేయడం, కారును తగలబెట్టడం దుర్మార్గమని ఖండించారు. మూడుసార్లు ఎంపీగా గెలిచిన వ్యక్తికే రక్షణ లేకపోతే ఇక సామాన్య కార్యకర్తల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు కనుమరుగతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'మొబైల్ హార్ట్'తో 500 సెల్ ఫోన్లు రికవరీ

-ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడి



రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను మీడియాకు చూపుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్: రూ.90లక్షల విలువ చేసే 500 సెల్ ఫోన్లు రికవరీ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడించారు. గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడా రు. తిరుపతి జిల్లా పరిధిలో పోగొట్టుకున్న వారి సెల్‌ఫోన్ల కోసం ప్రత్యేకంగా జిల్లా పోలీసులు ఏర్పా టు చేసిన 'మొబైల్ హార్ట్' (పోలీస్ వాట్సాప్ నంబర్ 9490617873) అప్లికేషన్‌కు వచ్చిన ఫిర్యాదు లపై గతంలో రూ.5.45 కోట్ల విలువచేసే 3030 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. తిరిగి తాజాగా పదో విడతలో ఇప్పుడు 500 సెల్‌ఫోన్లను సైబర్ క్రైమ్ పోలీసులు రికవరీ చేశారన్నారు. ప్రధానంగా తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు మొబైల్ పోగొట్టుకుంటున్నారని, అలాగే కొన్ని దొంగతనానికి గురవుతున్నాయని తెలిపారు. అలాంటి వారంతా 'మొబైల్ హార్ట్' కు హాయ్ అని మెస్సేజ్ చేస్తే లింకు వస్తుందని, అందులో వారి వివరాలను పూర్తి చేయాలన్నారు. సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్)లో ఇది నమోదవుతుందన్నారు. సెల్‌ఫోన్‌లో ఉన్న సమాచారం దుర్వినియోగం కాకుండా ఆ ఫోన్ బ్లాక్ అవుతుందన్నారు. దాని ద్వారానే సెల్‌ఫోన్లను త్వరగా రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. రికవరీ చేసిన మొబైల్స్‌న్నీ ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రం నుంచి తీసుకొచ్చామన్నారు. సెల్‌ఫోన్ల దుకాణాల యజమానులు, నిర్వాహకులు అజ్ఞాత వ్యక్తుల నుంచి సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనుగోలు చేయరాదన్నారు. కేసును ఛేదించడంలో ఏఎస్పీ వెంకట్రావు, సైబర్ సీఐ వినోద్ కుమార్, సిబ్బంది ఎంతగానో కృషి చేశారన్నారు. అనంతరం సైబర్ సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించం

- తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలి
- వసతి గృహాలపై ప్రత్యేక నిఘా
- సమీక్షలో కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: పిల్లల తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందని, హాస్టళ్లలో పిల్లల బాగోగులు విస్మరించి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన విద్యార్థుల వసతి గృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై ఆయా విభాగాల అధికారులతో సమీక్షించారు. తమ పిల్లలను సురక్షితమైన ప్రదేశంలో వదులుతున్నామనే నమ్మకంతో హాస్టళ్లలో చేర్చుతారని, అయితే కొందరు వార్డెన్లు బాధ్యత లేకుండా వ్యవహరించడం వల్ల పరిస్థితులు మరోలా ఉంటున్నాయని ఇటీవలే నాయుడుపేట గురుకుల పాఠశాలలో పెద్ద సంఖ్యలో పిల్లలు తీవ్ర అస్వస్థతకు గురైన ఉదంతాన్ని ఆయన ఉదహరించారు. అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురుకుల పాఠశాలలు, కళాశాలలతోపాటు సంక్షేమ హాస్టళ్లపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రధానంగా మెనూ పాటిస్తూ, నాణ్యమైన భోజనం పెట్టాలని, పరిసరాలు, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు, విష కీటకాల బెడద లేకుండా అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. అన్ని విభాగాల జిల్లా అధికారులు వీటిని తరచూ పర్యవేక్షించాలన్నారు. రెండు వారాలపాటు ప్రత్యేక నిఘా ఉంచి ఆగష్టు 10వ తేదీ నాటికి వసతి గృహాల మెరుగుపై నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వసతి గృహాలే కాకుండా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం, మెరుగైన వసతుల కల్పన అంశాలపై దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి వి.శేఖర్‌ను ఆదేశించారు. సమావేశంలో తిరుపతి సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, చిత్తూరు అధికారి రాజ్యలక్ష్మి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్, జిల్లా గురుకుల పాఠశాలల అధికారి పద్మజ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సూర్యనారాయణ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి చిన్నారెడ్డి, ఈడీ బీసీ కార్పొరేషన్ శ్రీదేవి, ఈడీ మైనారిటీ కార్పొరేషన్ హరినాథ్ రెడ్డి, డీటీడబ్ల్యూ అధికారి మూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

భావితరాలకు శాస్త్ర విజ్ఞానం



సదస్సుకు హాజరైన ముఖ్య అతిథులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: భారతీయ సంస్కృత శాస్త్రాలలోని విజ్ఞానాన్ని భావితరాలకు అందించడమే వర్సిటీ లక్ష్యంగా పనిచేస్తుందని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ఉద్ఘాటించారు. 'కాళిదాసు సాహిత్యం, కావ్యం, సౌందర్యం–వైజ్ఞానికి వైభవం' అను అంశంపై గురువారం జాతీయ సంస్కృత వర్సిటీలో రెండురోజుల జాతీయ సదస్సు ప్రారంభంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. సంస్కృత శాస్త్రాల్లో ప్రాచీన కవులు భావితరాలకు ఉపయోగపడే ఎన్నో వైజ్ఞానిక అంశాలను నిక్షిప్తం చేశారని, ఆ శాస్త్రాల్లోని వైజ్ఞానిక సంపదను విద్యార్థులు అధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు. న్యూఢిల్లీ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్‌కౌశిక్ మాట్లాడుతూ, శాస్త్రాల్లోని వైజ్ఞానికి, సామాజిక అంశాలను వెలికి తీయడం కోసం ఇలాంటి జాతీయ సదస్సులు ఉపకరిస్తాయన్నారు. భారతీయ జ్ఞాన సంపదను వెలికి తీసి భావితరాలకు అందించేందుకు కేంద్రప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, సాహిత్య శాస్త్ర రిటైర్డ్ ప్రొఫెసర్ కే. రామసూర్యనారాయణ, ఎస్వీ వేదిక్ వర్సిటీ విశ్రాంత వీసీ ఎస్.సుదర్శన్ శర్మ, రాష్ట్రీయ సంస్కృత వర్సిటీ మాజీ వీసీ హరేకృష్ణ శతపతి, ప్రొఫెసర్లు కే.రాజగోపాలన్, భరత్ భూషణ్, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.